క్లుప్తంగా

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధికారులను సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొన్నూరు మెయిన్ రోడ్డు విస్తరణ కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

పెదకాకాని: సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి కోరారు. మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



కాకుమాను: పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని హెచ్ఎం బి.సత్యం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కొల్లా నాగేశ్వరరావు మంగళవారం పాఠశాలలకు రూ.17 వేలు విలువ చేసే లేజర్ ప్రింటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం సత్యం మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు పాఠశాలలో విద్యనభ్యసించిన ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పోషకాహార ప్రదర్శన



వంగిపురం(ప్రత్తిపాడు): మండల పరిధిలోని వంగిపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. చిరుధాన్యాలతో పోషకాహారాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, వెంకటేశ్వరమ్మ, హేమలత, యశోద, సరస్వతి తయారు చేశారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలతో తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చు అన్నది వివరిస్తూ రకరకాల పోషకాహార పదార్థాలతో తయారు చేసిన వంటకాలను శిబిరం వద్ద ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ వి.సుజాతదేవి చిరుధాన్యాలు, ఆకుకూరల ప్రాధాన్యాన్ని మహిళలకు వివరించారు. ఆమె వెంట అడిషనల్ సీడీపీఓ సీహెచ్. విజయనిర్మల, సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరహరి తెలిపిన వివరాలు.. తోకావారిపాలెం గ్రామానికి చెందిన వేల్పూరి తంబి(31) ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వెళుతున్నారు. ఈ క్రమంలో చిన్నపలకలూరు సమీపంలో పేరేచర్ల వైపు నుంచి వస్తున్న కారు మితిమీరిన వేగంతో తంబి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తంబికి తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. కేవీపీ కాలనీకి చెందిన షేక్ నజీరుద్దీన్ ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుకగా వస్తున్న కారు మితిమీరిన వేగంతో ఢీకొనడంతో నజీరుద్దీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో నజీరుద్దీన్‌ను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఘటనపై బాధితుడి తండ్రి సలీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ప్రజారోగ్యానికి భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వేజండ్లలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పొన్నూరు: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే మన జగనన్న ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పట్టణంలోని 13వ వార్డు జై భారతి రెడ్డి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభకు జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ప్రజలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, డాక్టర్ టి.హేమలత, యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమ్మద్, రూరల్ అధ్యక్షుడు ఆదిశేషులు, నాయకులు మల్లెల రాజు, వేముల మూర్తి రాజు, మండ్రు వెంకటరత్నం, మండ్రు అనిత, దాసరి నారాయణరావు పాల్గొన్నారు.

చిన్నపలకలూరులో..

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్య రక్షణ అని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నపలకలూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు, మిర్చి యార్డు డైరెక్టర్ బండలపాటి వెంకటేశ్వరరావు(ఇంద్ర), జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచి ఎ.వెంకట్, టి.నాగేశ్వరరావు, పోతురాజు, నరేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు

గరికపాడు(కాకుమాను): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టినట్లు మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. మండలంలోని గరికపాడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రేమ కుమారి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ-2 విజయ భాస్కర్ పాల్గొన్నారు.

వేజండ్లలో..

వేజండ్ల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శ్రీరామరక్షగా మారిందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. స్థానిక హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. మెగా క్యాంప్‌లో స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేశారు. వివిధ స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ చేపడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. హెల్త్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, ఎంపీపీ కె.సాహితి, ఎంపీడీఓ బి.బాబూరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, షేక్ పెదమస్తాన్, కాసు ఈశ్వరరెడ్డి, శనాగల వెంకటరెడ్డి, ముత్తేశ్వరరావు, మగ్బుల్ పాల్గొన్నారు.



అర్హులైనవారికి మందులు పంపిణీ చేస్తున్న గుంటూరు రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

జగనన్న ఆరోగ్య సురక్షతో భద్రత

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని చిన్నపలకలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజలకు అందిస్తున్న సేవలు, వైద్య శిబిరాల నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా జరిగే సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం అందజేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. క్యాంప్‌లలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసే కేంద్రాలను పరిశీలించారు. వైద్య పరీక్షలు చేసి ఎవరికైనా ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వ లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ శ్రావణబాబు, డ్వామా పీడీ యుగంధర్, ఎంపీడీఓ ఆదినారాయణ, గుంటూరు వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు పాల్గొన్నారు.



కళ్లజోళ్లను, వైద్య పరీక్షల కిట్లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

మన ఊరికి తరలివచ్చిన వైద్యం



శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఐఓ సుబ్బరాజు



నేత్ర పరీక్షల కోసం వేచి ఉన్న వృద్ధులు

- వంగిపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం
- వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించిన వైద్యులు

వంగిపురం (ప్రత్తిపాడు): వైద్యం ఊరికి తరలివచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో మన ఊరికి, మన ఇంటికే నేరుగా వైద్యులు, వైద్య సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. మండల పరిధిలోని వంగిపురంలో మంగళవారం శిబిరాన్ని నిర్వహించారు. చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ముకేష్‌కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ అంజలీదేవి, జనరల్ వైద్యాధికారులు దివ్యమేఘన, అనూష శిబిరానికి హాజరైన 330 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, డెంగీ, మలేరియా.. వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు అక్కడికక్కడే చేసి మందులను అందజేశారు. అదేవిధంగా ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం నేత్ర పరీక్షల బృందం వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసి మందులివ్వడంతో పాటు సమస్య తీవ్రంగా ఉన్న వారికి కళ్లజోళ్లను అందించనున్నట్లు చెప్పారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుబ్బరాజు పరిశీలించారు. శిబిరానికి వస్తున్న రోగులు, నమోదవుతున్న అనారోగ్య సమస్యల వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చేస్తున్న పరీక్షల వివరాలను వైద్యులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఓటరు సర్వే సక్రమంగా చేయాలి

పొన్నూరు: నియోజకవర్గంలో చేపడుతున్న ఓటరు సర్వే సక్రమంగా నిర్వహించాలని ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు సర్వేపై నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సహాయ ఓటరు నమోదు అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఓటు వేసేందుకు వీలుగా 27 పోలింగ్ బూత్‌లను మార్పు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 27న ఓటర్ల నమూనా జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. దానిపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఈఆర్ఓ హరిహరనాథ్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, తహసీల్దార్ కే శ్రీకాంత్, డీటీ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సాయం

నగరంపాలెం: కోవిడ్-19 బాధితులతో పాటు ఐదేళ్లుగా పేదల ఆకలి తీరుస్తూ, ఇతరత్రా సామాజిక సేవలు అందిస్తున్న 'గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్' సేవలు అభినందనీయమని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీకృష్ణమూర్తి అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ తరఫున సేవలు అందిస్తున్న గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు రూ.2 లక్షలను మంగళవారం చంద్రమౌళినగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శ్రీకృష్ణమూర్తి అందజేశారు. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక, చైర్మన్ పఠాన్ అల్లాబక్షు మాట్లాడుతూ దాతల సహకారంతో జీజీహెచ్ వద్ద నిత్యాన్నదానం చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు విద్య, వైద్య, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ట్రస్టీ పి.ప్రతీష, ఊటుకూరి నాగేశ్వరరావు, పఠాన్ హబీబ్‌బాషా పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీకృష్ణమూర్తి

వైఎస్సార్ సీపీకి ప్రజల్లో విశేష ఆదరణ

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి నవంబర్ 11వ తేదీ వరకు జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్'' అనే నినాదంతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు పార్టీ శ్రేణులు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు పాటుపడాలని సూచించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేశారని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పగ్గాలు చేపట్టిన తరువాత తీసుకున్న నిర్ణయాలు, ప్రతి అంశంలో చేపట్టిన అభివృద్ధి, ప్రతి ఇంటికి చేరువైన సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసి రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో తూర్పు నియోజకవర్గాన్ని గెలిపించుకొని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

లక్ష్మీపురం: ఆధునిక వైద్య ప్రగతిలోనూ జీవనశైలి మార్పులతోనూ ప్రణాళికాబద్ధమైన జీవితంతో వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఆహ్లాదకరంగా ఉండవచ్చని డాక్టర్ ఏ సృజన్ కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సృజన్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యం శాపం అనుకోవడం మానసికంగా కృంగిపోవటం డిప్రెషన్‌కిలోను కావటం పనికిరాదన్నారు. యవ్వనంలో ఎంత హుషారుగా ఉన్నారో వృద్ధాప్యంలో కూడా అలాగే ఆరోగ్యంగా ఆహ్లాదంగా ఉండవచ్చన్నారు. అనంతరం దేశ విదేశాల్లో ఉన్న వారికి సంగీత క్లాసులు నిర్వహిస్తూ వేలాది మంది శిష్యుల అభిమానం పొంది 84 ఏళ్లవయసులో ఇప్పటికీ కూడా సంగీతాన్ని బోధిస్తున్న మున్నంగి అన్నపూర్ణను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ వి.జయ, అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు అంజిరెడ్డి ఘనంగా సత్కరించారు.



మున్నంగి అన్నపూర్ణను సత్కరిస్తున్న దృశ్యం

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురులో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్.బాబర్ వద్ద 13 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చలం తెలిపారు.

సమాజంలో సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను సమానంగా చూడాలి



అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే పోస్టర్లు విడుదల చేస్తున్న రంగరాజు, మధుసూదనరావు, సువార్త

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను అందరితో సమానంగా చూడాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్(మూగ, చెవుడు) దినోత్సవాన్ని నిర్వహించారు. రంగరాజు మాట్లాడుతూ పుట్టుకతో వివిధ శారీరక లోపాలకు గురైన వ్యక్తులకు సమాజం అండగా నిలవాలని, శారీరక లోపాలు కలిగిన వారిలో అద్భుతమైన మేధా సంపత్తి, నైపుణ్యాలు ఉంటాయని అన్నారు. ఈసందర్భంగా సైన్ లాంగ్వేజ్ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఏ సువార్త, జిల్లా అధ్యక్షుడు ఎస్.చంటిబాబు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్డీ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

వీఐటీ- ఏపీలో సంగీత కచేరి

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ-ఏపీలో మంగళవారం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ సెల్ సహకారంతో హార్మోనీ అనలిస్ట్ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అర్జిత్‌సింగ్ పాడిన సోను నిగమ్ కల్ హో నాహో, సిద్ శ్రీరామ్ పాడిన యువన్ శంకర్ రాజా నీ యదలో నాకు, శ్రేయ ఘోషల్ పాడటానికి శ్వేతామోహన్ రాసిన వా వాతి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి సంగీత కచేరి నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నల్ చాప్టర్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ సీబీ చక్రవర్తి సాంకేతికత, సృజనాత్మకత అద్భుత కలయికతో రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మ్యూజిక్ వీడియోలు ప్రదర్శించారు. నల్ చాప్టర్ ప్రెసిడెంట్ వెంకట్ హర్ష రాయసం, వైస్ ప్రెసిడెంట్ కె ప్రణవ్ సాయి, సంజయ్‌ల సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఐఐఈసీ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ హరిసీత, డాక్టర్ శిబి చక్రవర్తి, ప్రొఫెసర్ శామ్యూల్ జాన్సన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలను ప్రజలకు అందిస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పెదపలకలూరు గ్రామంలో డివిజన్‌లో నూతనంగా మంజూరైన 65 వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, ముత్యాల శ్రీనివాసరావు, షేక్ బుజ్జి, షేక్ జానీ, పశుమర్తి ఏలియా టి.శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బంగారయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నిరసన



పెదకాకాని: వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నిరసన తెలియజేస్తున్న రైతులను కారుతో తొక్కించి చంపడానికి నిరసనగా మంగళవారం పెదకాకానిలో బ్లాక్ డే నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, గుంటూరు జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు. కార్యక్రమంలోమహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్, ఆర్.బాబూరావు, సిహెచ్.విజయలక్ష్మి, కోటిపల్లి సత్యనారాయణ, వి.శివయ్య, నీలాంబరం, బాబూరావు, బాలయ్య, మోహన్ పాల్గొన్నారు.

కోబాల్డుపేటలో అన్నదానం



పట్నంబజారు: ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏఆర్ యూఆర్ యూత్ నాయకులు ఆజం మాలిక్, చల్లా కోటి ఆధ్వర్యంలో మంగళవారం కోబాల్డుపేటలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు క్లస్టర్ ఇన్‌చార్జి నూనె ఉమామహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో దేవపురంలో మహిళలకు చీరల పంపిణీ చేయగా, డీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక జాన్సీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టగా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు.